ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 29 మార్చి 2025



పసుకుడిలో ఏనుగులు



భామిని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా ఘనసరలో సంచరించిన ఏనుగులు గురువారం రాత్రి పసుకుడి చేరుకున్నాయి. దీంతో ఎటువంటి నష్టం సంభిస్తుందోనని ఆ ప్రాంత వాసులు బెంబేలెత్తిపోతున్నారు. శుక్రవారం పసుకుడి వంశధార నదీతీరం జీడితోటల్లో ఏనుగులు తిష్ఠ వేయడంతో అటువైపు రైతులు వెళ్లలేకపోతున్నారు. తక్షణమే వాటిని తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దాలినాయుడు, ట్రాకర్స్ ఏనుగులను పర్యవేక్షిస్తున్నారు.

లే చిన్నా.. ఇంటికెళ్దాం!

- చదువుకని వెళ్లి... తిరిగిరాని లోకాలకు
- ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థి మృతి
- కన్నీరు మున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు



చలపతి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదిస్తున్న తల్లి లడ్డమ్మ

సీతంపేట రూరల్,మార్చి 28(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబం.. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. తండ్రి లేని ఇంటిలో తల్లికి చేదోడు వాదోడుగా నిలిచాడు. వయసులో చిన్నవాడైనా కుటుంబ బాధ్యతను తనపై వేసుకున్నాడు. కూలి పనులు చేసుకుంటూ.. చదువునూ కొనసాగించాడు. అయితే ఆ కుటుంబంపై విధి చిన్నచూపు చూసింది. మృత్యువు రూపంలో కబళించింది. రెండు నెలల తర్వాత ఆశ్రమ పాఠశాలకు వెళ్లిన ఓ విద్యార్థి తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయాడు. బిడ్డ బాగా చదువుకొని తనను పోషిస్తాడని ఆశించిన ఆ తల్లికి కడుపుకోతే మిగిలింది. వివరాల్లోకి వెళ్తే..

కొత్తగూడ పంచాయతీ కె.కాగుమాను గూడకు చెందిన సవర చలపతి(14) సీతంపేట ఐటీడీఏ పరిధి దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కుటుంబ పరిస్థితుల కారణంగా రెండు నెలలుగా చదువుకు దూరమైన ఆ విద్యార్థి గురువారం సాయంత్రమే పాఠశాలకు చేరాడు. కాగా శుక్రవారం ఉదయం హాస్టల్ గదిలో తాను పడుకుంటున్న బంకర్ బెడ్ పైకి తువ్వాలు కట్టి ఎక్కేందుకు ప్రయత్నించాడు. అయితే ఇంతలో బెడ్ ఒక్కసారిగా ఒరిగి చలపతిపై పడింది. బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరాడు. దీన్ని గుర్తించిన పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు చలపతిని సమీపంలోని దోను బాయి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి భానుప్రతాప్ చికిత్స అందిస్తుండగానే విద్యార్థి మరణించాడు. పాఠశాల సిబ్బంది నుంచి సమాచారం తెలుసుకున్న తల్లి లడ్డమ్మ, కుటుంబసభ్యులు, గ్రామస్థులు హుటాహుటిన దోనుబాయి ఆసుపత్రికి చేరుకున్నారు. విగతజీవిగా పడి ఉన్న చలపతిని చూసి తల్లి లడ్డమ్మ షాక్‌కు గురైంది. మృతదేహంపై పడి భోరున విలపించిన తీరు స్థానికులకు కంటతడి పెట్టించింది.



సవర చలపతి (ఫైల్)

నిరుపేద కుటుంబం

కె.కాగుమానుగూడకు చెందిన సవర భీముడు, లడ్డమ్మకు ముగ్గురు కుమారులు. భీముడు మూడేళ్ల కిందట మృతి చెందాడు. కుమారులైన గణేష్, ప్రసాద్, చలపతిలతో కలిసి లడ్డమ్మ అదే గ్రామంలో నివసిస్తోంది. మృతి చెందిన విద్యార్థి అందరికంటే చిన్నవాడు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో రెండు నెలలు పాటు చలపతి తల్లికి అండగా ఉంటూ కూలీ పనుల కోసం వెళ్లినట్టు గ్రామస్థులు తెలిపారు.

న్యాయం చేస్తాం: ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

ప్రమాదవశాత్తు మృతి చెందిన గిరిజన విద్యార్థి సవర చలపతి కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేస్తామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం ఉదయం ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొరలు దోనుబాయి ఆశ్రమ పాఠశాలకు చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అయితే అప్పటికే విద్యార్థి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళన చేశారు. ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి దోనుబాయి ఆశ్రమ పాఠశాలకు చేరుకొని

(మిగతా 6వ పేజీలో...)



మృతుని కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి పీవో

ఈకేవైసీకి 31 వరకు గడువు

- జిల్లాలో 79 వేల మంది పెండింగ్

కొమరాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రేషన్‌లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కార్డు దారులకు ఈకేవైసీ అప్‌డేట్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఇందుకు గాను ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చింది. అయితే ఈకేవైసీ అప్‌డేట్ కాకుంటే వచ్చే నెలలో రేషన్ పొందే అవకాశం ఉండదని పౌర సరఫరాల శాఖ సిబ్బంది చెబుతున్నారు. జిల్లాలో నాలుగు లక్షల వరకు రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిల్లో సుమారు 8,16,859 మంది సభ్యులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 7,37,657 మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 79,202 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. జీవనోపాధి కోసం వలస వెళ్లిన వారు రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో ఉన్నా సమీప మీసేవ కేంద్రం, చౌక ధరల దుకాణం, ఆధార్ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకునే వెసులబాటును ప్రభుత్వం ఇచ్చింది. రేషన్ డీలర్లు, తహసీల్దార్లు, డీఎస్‌వో లాగిన్‌లో ఈ వివరాలు అందుబాటులో ఉంచారు. ఐదేళ్లలోపు పిల్లలు మినహా జాబితాలో పేర్లున్న వారు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే ఈ జాబితా డీలర్ల ఉందని .. వారిని సంప్రదించి ఈకేవైసీ వివరాలు తెలుసుకోవాలని చెబుతున్నారు. ఈ నెలాఖరులోపు ఈకేవైసీని శతశాతం పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోందని డీఎస్‌వో రాజేశ్వరి తెలిపారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఒకటో తేదీన ఏడు గంటల నుంచి పంపిణీ ప్రారంభించాలని, మొదటి రోజునే శతశాతం పింఛన్ల అందజేతకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్ట రేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 1,39,752 మందికి ఎన్టీఆర్ భరోసా కింద రూ.59.72 కోట్లను పింఛన్ల రూపంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 'ఉపాధి హామీ పథకం కింద 117 సాగునీటి వనరుల్లో పూడికలు తీసే అవకాశం ఉంది. 331 ప్రహరీలు మంజూరు చేయగా 317 పనులు ప్రారంభమయ్యాయి. వంద ఎకరాలకు మించి ఆయకట్టు ఉన్న చెరువుల్లో చేపల పెంపకం చేపట్టాలి. ప్రతి కుటుంబం ఆదాయ వనరుకు అవకాశం ఉన్న రంగాన్ని ఎంచుకోవాలి. రాగిపిండి తయారీ, పసుపు, చింతపండు ప్రాసెసింగ్, చేపల పెంపకం, ఉద్యాన పంటలు , చెత్త నుంచి సంపద తయారు వంటివి చేపట్టాలి. జిల్లాలో కనీసం పది వేల ఎకరాల్లో పశుగ్రాసం పెంచాలి. పది వేల కుటుంబాలకు సూర్యఘర్ కింద విద్యుత్ అందించాలి. పబ్లిక్ పర్సెప్షన్‌లో జిల్లా నాలుగో స్థానంలో ఉండడంపై ముఖ్యమంత్రి ప్రశంసించారు. ప్రతి విద్యార్థికి సంబంధించిన వివరాలు పక్కాగా ఉండాలి. బడిఈడు పిల్లలు విధిగా పాఠశాలల్లో ఉండాలి. లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవు. పాఠశాల విద్యార్థుల్లో మృతులు ఉంటే వారి వివరాలు, విశ్లేషణతో సహా ఉండాలి. ఉపాధ్యాయ, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలి. చదవడం, రాయడంలో విద్యార్థి అందివేసిన చేయి కావాలి. ఫైస్కూల్ ఫై ప్రైడ్ కార్య క్రమాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి పటిష్ఠంగా అమలు చేస్తాం. జీరో పావర్టీ పీ-4 సర్వేలో జిల్లా పౌరుల భాగస్వాములు కావాలి. ఎండల తీవ్రత దృష్ట్యా జిల్లావ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఆయా ప్రాంతాల్లో ఉన్న కార్యాలయాలు, సంస్థలు, సంఘాల సహకారం తీసుకోవాలి. ప్రజలను అప్రమత్తం చేయాలి. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు చేపట్టాలి.' అని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాఖ వెళ్తానని.. విగతజీవిగా మారి!

- అనుమానాస్పద స్థితిలో గిరిజన యువతి మృతి

సాలూరు రూరల్,మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం వెళ్తానన్న ఓ గిరిజన యువతి విగజీవిగా మారింది. అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సాలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రివానివలసకు చెందిన వాకాటి ఐశ్వర్య (20) మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. అనంతరం విశాఖపట్నంలోని ఓ దుస్తుల షాపులో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తోంది. వీలైనప్పుడు స్వగ్రామం మర్రివానివలస వచ్చి తల్లిదండ్రులను కలుసుకుని తిరిగి వెళ్లేది. ఇటీవల కూడా అదేవిధంగా ఆ యువతి ఇంటికి వచ్చింది. అయితే రెండు రోజుల కిందట విశాఖ వెళ్తున్నాని చెప్పి బయల్దేరింది. అయితే ఏమైందో ఏమో కానీ.. మామిడిపల్లి సమీపంలో ఉన్న చీపురువలస జీడితోటలో చెట్టుకు ఉరేసుకుని.. శవమై కనిపించింది. విషయం తెలిసిన తల్లిదండ్రులు, సోదరుడు కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కగానొక్క కుమార్తె ఇలా మరణించ డాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. సాలూరు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆమె మృతిపై ఆరా తీస్తున్నారు. ఐశ్వర్య దత్తివలసకు చెందిన ఒక యువకునితో సన్నిహితంగా ఉన్నట్టు గుర్తించారు. తండ్రి ధర్మారావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.



ఐశ్వర్య (ఫైల్)

అక్రమ కట్టడాలను పట్టించుకోరా?
- సాలూరులో ధ్వజమెత్తిన కౌన్సిలర్లు

6లో

గిరిజన చిన్నారులకు చదువు కష్టాలు

4లో

పరీక్ష రాస్తుండగా విద్యార్థినికి అస్వస్థత

- సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలింపు

సాలూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష రాస్తుండగా ఓ విద్యార్థిని అస్వస్థతకు గురైంది. ఈ సంఘటన సాలూరు మండలం బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ టెన్త్ పరీక్ష కేంద్రంలో జరిగింది. మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.ప్రశాంతి శుక్రవారం బొడ్డవలస కేంద్రానికి చేరుకుంది. జీవశాస్త్రం పరీక్ష రాస్తుండగా.. అధిక ఎండో.. లేక ఒత్తిడో తెలియదు కాని చివరి నిమిషంలో అస్వస్థతకు గురైంది. దీంతో హుటాహుటిన బాలికను ప్రథమ చికిత్స చేసి 108 వాహనంలో సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేయడంతో తేరుకున్న బాలికను ఇంటికి పంపించారు.



విద్యార్థినికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

వేతనాల చెల్లింపుల్లో అవకతవకలు

- ఉపాధి సామాజిక తనిఖీలో బట్టబయలు



వేతనాల చెల్లింపులపై ప్రశ్నిస్తున్న పీడీ రామచంద్రరావు

పాచిపెంట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ వేతనాల చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయి. శుక్రవారం పాచిపెంట మండల పరిషత్ కార్యాలయ వద్ద జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఈ విషయం బట్టబయలైంది. మండలంలోని 28 పంచాయతీలలోనూ మస్తర్లలో వేలిముద్రలు, సంతకాలు లేకుండా వేతనాలు చెల్లించారు. 128 వేతనదారుల పేరిట సుమారు రూ.1.50 లక్షలు చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. అప్పట్లో వారానికి మూడు రోజులు మాత్రమే ఉపాధి పనులు చేయాల్సి ఉండగా వారం రోజులు పనిదినాలుగా నమోదు చేసి వలంటీర్లు వేతనాలు చెల్లించినట్లు తేలింది. ఇకపోతే వివిధ పంచాయతీలలో నాటిన జీడి, మామిడి మొక్కల్లో 75 శాతం నీరు లేక ఎండిపోయాయి. 2023-24లో మండ లంలో రూ. 20.82 కోట్ల మేరకు అభివృద్ధి పనులు చేపట్టినట్లు డ్వామా పీడీ కె.రామచంద్రరావు తెలిపారు. వాటిల్లో ఉపాధి పనులకు రూ. 13.44 కోట్లు, పం చాయతీరాజ్ రూ. 2.69 కోట్లు, ఐటీడీఏ ద్వారా రూ. 4.67 కోట్లు, మెటీరియల్‌కు రూ.7.87 కోట్లు వెచ్చించామని వివరించారు. మస్తర్లపై వేలిముద్రలు, సంతకాలు లేకుండా వేతనాలు చెల్లింపులపై చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. ఎంపీపీ టి.ప్రమీల, ఎంపీడీవో పాత్రో తదితరులు పాల్గొన్నారు.

తొలి నుంచీ టీడీపీకి విజయమే
- ఉమ్మడి జిల్లాలో తరగని ఆదరణ
- అప్పట్లో ఎన్టీఆర్ విస్తృత పర్యటన
- విద్యావంతులకు రాజకీయాల్లోకి ఆహ్వానం
- 'అన్నగారి' పిలుపుతో ఎంతోమంది అరంగేట్రం
- నేడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం

4లో

పార్వతీపురం పట్టణాభివృద్ధికి పక్కా ప్రణాళిక
- మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

4లో

ఏఎంసీలకు ఛైర్మన్లు

- జిల్లాలో ముగ్గురికి అవకాశం
- పేర్లు ప్రకటించిన ప్రభుత్వం
- పెండింగ్‌లో పార్వతీపురం



మంత్రి సంధ్యారాణిని కలిసిన సాలూరు ఏఎంసీ ఛైర్మన్ సూర్యనారాయణ



కురుపాం ఏఎంసీ ఛైర్‌పర్సన్ కళావతి



పాలకొండ ఏఎంసీ ఛైర్‌పర్సన్ సంధ్యారాణి

పార్వతీపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాలూరు, కురుపాం, పాలకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీల(ఏఎంసీ)కు ఛైర్మన్లను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం జాబితాను విడుదల చేసింది. సాలూరు ఏఎంసీ ఛైర్మన్‌గా పాచిపెంట మండలం మాతుమూరు మాజీ సర్పంచ్, టీడీపీ కార్యదర్శి ఎం.సూర్యనారాయణ నియామకమయ్యారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందిన ఆయన టీడీపీ బలోపేతానికి విశేష సేవలం దిస్తున్నారు. కాగా తనకు ఈ అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు , మంత్రి సంధ్యారాణికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సాలూరుకు చేరుకున్న సూర్యనారాయణను మంత్రి అభినందించారు. కురుపాం ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా నియామకమైన కద్రక కళావతి గుమ్మలక్ష్మీపురం మండలం లక్కగూడ సర్పంచ్, ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆమెకు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. పాలకొండ ఏఎంసీ ఛైర్ పర్సన్‌గా సీతంపేట మండలం మర్రిపాడుకి చెందిన బిడ్డిక సంధ్యారాణి నియామకమయ్యారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సిఫారసుల మేరకు ఆమెఈ పదవి లభించింది. త్వరలోనే వారు బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా పార్వతీపురం ఏఎంసీకి ఛైర్మన్‌గా ఎవర్నీ ఎంపిక చేయలేదు. జిల్లాలో నాలుగు ఏఎంసీలకు వైస్ ఛైర్మన్లు, డైరెక్టర్లను ఖరారు కావాల్సి ఉంది.

నిరీక్షణ లేకుండా రిజిస్ట్రేషన్

- ఉగాది, రంజాన్‌కు సెలవు లేదు
- కార్యాలయాలు పనిచేస్తాయ్
- జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్

బెలగాం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టిందని జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్ తెలిపారు. నిరీక్షణ లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించిందని చెప్పారు. శుక్రవారం ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ.. ఏప్రిల్ నుంచి రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనున్నామని తెలిపారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేదని , ఇకపై ఆ పరిస్థితి ఉండదని వెల్లడించారు. ముందస్తు స్లాట్ బుకింగ్‌తో నిరీక్షించాల్సిన అవసరం ఉండదని చెప్పారు. 2024-2025 ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఈ నెల 30, 31న రిజిస్టర్ కార్యాలయాలు పనిచేస్తాయన్నారు. ఉగాది, రంజాన్ పండగలు న్నప్పటికీ సెలవు లేదని తెలిపారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు రూ.78 కోట్ల లక్ష్యం విధించగా.. దాదాపు చేరువయ్యామని స్పష్టం చేశారు. కురుపాం, పాలకొండలో లక్ష్యాలను అధిగమించామని, పార్వతీ పురంలో రెండు శాతం వెనకబడ్డామని తెలిపారు. అయితే ఇంకా రెండు రోజుల సమయం ఉన్నందున లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.



జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్



తొలి నుంచీ టీడీపీకి విజయమే

- జిల్లాలో తరగని ఆదరణ
- అప్పట్లో ఎన్టీఆర్ విస్తృత పర్యటన
- విద్యావంతులకు రాజకీయాల్లోకి ఆహ్వానం
- 'అన్నగారి' పిలుపుతో ఎంతోమంది అరంగేట్రం
- నేడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం

విజయనగరం/పార్వతీపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు... ఈ పేరు సినీ రంగంలో ఎంత సంచలనమో... తెలుగుదేశం పార్టీ పేరు రాజకీయ రంగంలో అంతే సంచలనం. 1982 మార్చి 29న ఎన్టీఆర్.. తెలుగుదేశం పార్టీని స్థాపించారు. ఆ సమయంలో రోజురోజుకూ ఎన్టీఆర్‌కి.. టీడీపీకి పెరుగుతున్న ఆదరణను చూసిన పాలకులు వెంటనే ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. అది కూడా ఆయనకు వరమైంది. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టి...రికార్డు సృష్టించారు. తొలిసారి ఎన్నికల్లో జిల్లాలోని 12 నియోజకవర్గాలకు గాను 10 చోట్ల ఇక్కడి ప్రజలు టీడీపీకి అఖండ విజయాన్ని అందించారు. నాటికీ నేటికీ అదే స్థాయి ఆదరణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.

'బొబ్బిలిపులి' తరువాత..

1982 జనవరి 9న 'బొబ్బిలిపులి' చిత్రం విడుదలైంది. విజయనగరంలోని మినర్వా థియేటర్‌లో ఆ చిత్రం విడుదలైంది. ఆ మరుసటి రోజే ఎన్టీఆర్ విజయనగరంలో పర్యటించారు. దీంతో అభిమానులు ఉవ్వెత్తున తరలివచ్చారు. అక్కడికి రెండు నెలలకే మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించారు. అప్పటికే ఎన్టీఆర్ అభిమాన సంఘ నాయకులు సత్యమూర్తి (ఆడిటర్), ఐవీపీ రాజు, గెద్ద రామలింగస్వామి, కనకల మురళీమోహన్, ముచ్చి రామలింగస్వామి, బాబులు, మూర్తి ఇలా కొంత మంది టీడీపీ ఆవిర్భావంతో విజయనగరం జిల్లాలో ఎన్టీఆర్ యువసేనగా మారిపోయారు. ఎన్టీఆర్ పర్యటనలో వీరంతా భాగస్వాములయ్యారు.

ఎన్టీఆర్ సభలతో...

నగరంలోని ఆయోధ్య మైదానం, సిటీబస్టాండ్ వద్ద ఎన్టీఆర్ ప్రచార సభలు జరిగాయి. ఎన్టీఆర్ సభలకు అశేషంగా జనాలు తరలివచ్చారు. పోలీసుల రక్షణలో కాకుండా ఎన్టీఆర్ అభిమానుల రక్షణలో ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడిక్కడ జనాదరణ లభించడంతో ఎన్టీఆర్ ఉప్పొంగిపోయారు. అదే ఉత్సాహంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. అశోక్ బంగ్లా, ప్రేమసమాజం తదితర ప్రాంతాల్లో ఎన్టీఆర్ బస చేశారు. ప్రచారం ముగించుకుని రాత్రి 11 గంటలకు ఆయన నిద్రించినా.. తెల్లవారుజామున 5 గంటలకే తిరిగి చైతన్యరథంపై పయనమయ్యేవారు. ఉదయం 5 గంటలకే ఎన్టీఆర్‌ని చూసేందుకు జిల్లా ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చేవారు. అనంతర కాలంలో ఆ అభిమానమే జిల్లాలో తెలుగుదేశం పార్టీకి తిరుగులేని విజయాన్ని కట్టబెట్టింది. 43 ఏళ్లుగా అదే ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వంలో పార్టీ ముందుకు వెళుతోంది.

అదే స్థాయిలో ఆదరణ

పార్టీ ఆవిర్భావం నుంచీ ఇప్పటి వరకూ రోజురోజుకూ తెలుగుదేశం పార్టీకి ఆదరణ పెరుగుతూనే ఉంది. ఇందులో భాగంగా ఏటా క్రమం తప్పకుండా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం... సంస్థాగత ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తూ వస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు... అది పూర్తయిన తరువాత క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ పార్టీ కమిటీలు ఏర్పాటు వంటివి జరుగుతున్నాయి. క్రమం తప్పకుండా ఈ రెండు ప్రక్రియలు నిర్వహిస్తున్న రాజకీయ పార్టీ టీడీపీయేనని నాయకులు బలంగా చెబుతుంటారు. వివిధ కారణాలతో నాయకులు పార్టీలు మారుతున్నా..ప్రజలు, కార్యకర్తలు మాత్రం టీడీపీతోనే ఉంటున్నారు. పార్టీ కూడా కార్యకర్తల కోసం ప్రత్యేకంగా బీమాను అమలు చేస్తుండడం గమనార్హం.

విజయనగరంలో ఇలా..

విద్యావంతులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన ఎన్టీఆర్... విజయనగరంలో పీవీజీ రాజు కుటుంబ సభ్యులైన ఆనంద గజపతిరాజు, అశోక్ గజపతిరాజును అప్పట్లో పార్టీలోకి ఆహ్వానించారు. కోళ్ల అప్పలనాయుడు తదితరులు అప్పటికే ఇతర పార్టీల్లో ఎమ్మెల్యేలుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉత్తరావల్లి నియోజకవర్గం నుంచి కోళ్ల అప్పలనాయుడు, విజయనగరం నుంచి ఆనందగజపతిరాజు, బొబ్బిలి నుంచి శంబంగి వెంకటచినప్పలనాయుడు, భోగాపురం నుంచి పతివాడ నారాయణస్వామి నాయుడు, కిమిడి కళా వెంకటరావు ఇలా అనేక మంది క్రమక్రమంగా టీడీపీ బాట పట్టారు. పార్టీలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. అశోక్ గజపతిరాజు అటు ఎన్టీఆర్, ఇటు చంద్రబాబు ఇద్దరి క్యాబినెట్లలోనూ మంత్రి పదవులు చేపట్టారు.



ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న ఎన్టీఆర్ (ఫైల్)



ఎన్టీఆర్‌తో మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు (ఫైల్)

ఆ కుటుంబం తెలుగుదేశంతోనే..



ఎన్టీఆర్‌తో మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు (ఫైల్)

శృంగవరపుకోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలో అధినేత నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్)తో కలిసి నడిచిన తొలితరం నాయకుల్లో కోళ్ల అప్పలనాయుడు ఒకరు. ఆయన ఉత్తరాపల్లి నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు శాసన సభ్యుడిగా వ్యవహరించారు. 1982లో పార్టీని స్థాపించినప్పుడు ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసేందుకు అప్పలనాయుడుకు ఎన్టీఆర్ అవకాశం ఇచ్చారు. 1983లో జరిగిన పార్టీ తొలి ఎన్నికల్లో అప్పటి రాష్ట్ర మంత్రి కె.వి.ఆర్.పి.ఎస్.పి.రాజుపై కోళ్ల గెలిచారు. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్‌ను నాదెండ్ల భాస్కరరావు పదవికి దూరం చేసినపుడు ఎన్టీఆర్‌కు అండగా నిలబడ్డారు. 1999 వరకు ఈ నియోజకవర్గం నుంచి వరుస విజయాలు అందుకున్నారు. అప్పటి నుంచి ఆయన కుటుంబం టీడీపీతోనే నడుస్తోంది. ఎన్టీఆర్ మరణానంతర కాలంలో 2009లో ఉత్తరాపల్లి నియోజకవర్గం రద్దయింది. అప్పలనాయుడు వృద్ధాప్యం కారణంగా... జనరల్‌గా మారిన శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆయన మనమరాలు, కోడలు లలిత కుమారికి టీడీపీ అధినేత చంద్రబాబు టికెట్ కేటాయించారు. అప్పటి నుంచి నాలుగుసార్లు ఆమెకే టికెట్ కేటాయించారు. లలిత కుమారి భర్త కె.బి.ఎ.రామప్రసాద్ రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.



చంద్రబాబుతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఎస్.కోట టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి (ఫైల్)

అప్పట్లో టిక్కెట్ కేటాయించారు



1983లో నాగూరు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఎన్‌టీ రామారావు నాకు కల్పించారు. స్వల్ప ఓట్లతో ఓడిపోయినప్పటికీ నా తండ్రి వెంపటాపు సత్యం పట్ల ఉన్న అభిమానాన్ని నాపై చూపించేవారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశారు. అప్పట్లో భద్రగిరి ఐటీడీఏ, బాలుర గురుకుల పాఠశాలను ఎన్‌టీఆర్ ప్రారంభించారు. కోటపాడులో హార్టికల్చర్ నర్సరీ, శిక్షణా సంస్థను ప్రారంభించారు. గిరిజనులతో సహపంక్తి భోజనం చేసిన ఎన్‌టీఆర్ జ్ఞాపకాలు నాతోపాటు మా గిరిజన ప్రాంతాల ప్రజల్లో నేటికీ ఉన్నాయి.

- వెంపటాపు భారతి, సమితి మాజీ అధ్యక్షురాలు

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే..



ఎన్‌టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చాను. చీపురుపల్లిలో ఎన్‌టీఆర్ నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంతో పాటు గండిపేటలో నిర్వహించిన రాజకీయ శిక్షణ శిబిరాల్లో పాల్గొన్నాను. టీడీపీ ప్రారంభం నుంచి నేటి వరకు తెలుగుదేశంలో కొనసాగుతూ వస్తున్నాను.

- గొట్టాపు వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ, పార్వతీపురం

పట్టణాభివృద్ధికి పక్కా ప్రణాళిక

- మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కమిషనర్ వెంకటేశ్వర్లు

పార్వతీపురం టౌన్, మార్చి 28: పట్టణాభివృద్ధికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. ఆ వివరాలు..

ప్రశ్న: పట్టణాభివృద్ధికి మీ ప్రణాళికలు ఏంటి?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు మున్సిపల్ సాధారణ నిధులతో పట్టణంలోని 30 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఇప్పటి వరకు రూ.1.82 కోట్లు అభివృద్ధి పనులకు ఖర్చు చేయగా... ఇంకా రూ.1.89 కోట్లతో వివిధ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

ప్ర: తాగునీటి సరఫరాకు సంబంధించి ఏం చేయబోతున్నారు?

జ: పట్టణ ప్రజలకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. సమ్మర్ ప్లాన్‌లో భాగంగా రూ.30 లక్షలు ఖర్చు చేస్తున్నాం. ప్రతి ఏటా తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు మున్సిపల్ బడ్జెట్‌లో కేటాయిస్తున్నాం.

ప్ర: పారిశుధ్యం మెరుగుకు ఏం చేస్తున్నారు?

జ: గ్రేడ్-1 మున్సిపాల్టీలో గల 30 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం. పారిశుధ్య పనులకు 133 మంది శాశ్వత, కాంట్రాక్టు కార్మికులను వినియోగిస్తున్నాం. 30 వార్డుల్లో రోజుకు 20 టన్నుల చెత్తను తరలించడంతో పాటు స్వచ్ఛ సుందర పార్వతీపురంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తున్నాం. స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమాన్ని విజయంతంగా అమలు చేస్తున్నాం.

ప్ర: వీధి దీపాల సక్రమ నిర్వహణకు తీసుకుంటున్న జాగ్రత్తలు ఏంటి?

జ: మున్సిపాల్టీలోని 30 వార్డుల్లో గల వీధుల్లో 2,735 వీధి దీపాలు ఉన్నాయి. వీటి నిర్వహణకు విజయనగరానికి చెందిన ఓ ప్రయివేటు సంస్థ పని చేస్తోంది. వీధి దీపాల నిర్వహణకు ఏడాదికి రూ.20 లక్షలు ఖర్చు చేస్తున్నాం. వీటిపై వచ్చే ఫిర్యాదులపై గంటలోపే స్పందిస్తున్నాం.

ప్ర: డంపింగ్ యార్డు తరలింపు సమస్యను ఎలా పరిష్కరిస్తున్నారు?

జ: డంపింగ్ యార్డు తరలింపుపై స్థానిక ప్రజాప్రతినిధులు, పాలక వర్గం సూచనలను పాటిస్తాం. ఇప్పటికే డంపింగ్ యార్డు తరలింపునకు సంబంధించి ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులతో కలసి ప్రత్యేక కార్యచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం.

ప్ర: 30 వార్డుల్లో దోమల నివారణకు చేపడుతున్న చర్యలు ఏంటి?

జ: పట్టణంలోని 30 వార్డుల్లో దోమల నివారణకు ప్రజారోగ్యశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు. రోజూ సాయంత్రం వీధుల్లో ఫాగింగ్‌తో పాటు కాలువల్లో దోమల నివారణకు మందు స్ప్రే చేస్తున్నాం.

ప్ర: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు ఏం చేస్తున్నారు?

జ: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశాం. మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సహకారంతో ప్రభుత్వ పథకాలు పేదలకు చేరే విధంగా చర్యలు చేపడుతున్నాం.



మండుటెండలో గ్రామానికి నడిచి వెళుతున్న చిన్నారులు

చదువు కష్టాలు..

సీతంపేట రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన చిన్నారులకు చదువు కష్టాలు తప్పడం లేదు. కె.జమ్మడుగూడ గ్రామానికి చెందిన 20 మంది చిన్నారులు అర కిలోమీటరు పైగా దూరంలో ఉన్న కె.కాగుమానుగూడ గ్రామంలోని జీపీఎస్ పాఠశాలకు ఇలా ప్రతిరోజూ నడిచి వెళ్లి వస్తుంటారు. శుక్రవారం మధ్యాహ్నం మండుటెండలో రోడ్డు పక్క నుంచి క్యూలైన్‌లో తమ గ్రామానికి వెళ్లడం కనిపించింది. ఇలానే సీతంపేట ఏజెన్సీలో అనేక పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులు ఇటువంటి ఇబ్బందులకు ఓర్చి చదువులు సాగిస్తున్నారు.



108 లింగాలకు రుద్రాభిషేకం

కొత్తవలస, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాలలో చివరి నెల ఫాల్గుణ మాస మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం 108 శివలింగాలకు తుమ్మికాపల్లి గేట్ సమీపంలోని ఓం సదనంలో రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ హోమాలు చేపట్టారు. కార్యక్రమంలో సదనం అర్చకుడు కిరణ్ కుమార్‌శర్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సారాపై ప్రత్యేక నిఘా

- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

విజయనగరం క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నియంత్రించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా ముద్దాయిలు, అనుమానితులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామస్థాయి, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రతి గ్రామాన్ని సారా లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఒడిశా అధికారులతో సంప్రదింపులు జరిపి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు.పార్వతీపురం, పాలకొండ, కురుపాం స్టేషన్‌లు నాటుసారాపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మూలించాలన్నారు. సమావేశంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు, ఏఈఎస్‌లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

బీసీ కార్పొరేషన్ రుణాలకు 19,616 దరఖాస్తులు

- జిల్లా వ్యాప్తంగా 3,379 యూనిట్ల లక్ష్యం
- ఆన్‌లైన్ నమోదుకు తక్కువ సమయం
- అధిక శాతం అభ్యర్థులు దూరం

విజయనగరం కలెక్టరేట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు జిల్లా వ్యాప్తంగా 19,616 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మండల, మున్సిపల్ పరిధిలో శుక్రవారం నుంచి ఇంటర్వ్యూ ప్రక్రియ మొదలు పెట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులను వివరాలను ఎంపీడీఓ, కమిషనర్ల లాగిన్ నుంచి సంబంధిత బ్యాంకు మేనేజర్ల లాగిన్‌లోకి పంపిస్తారు. ఇదిలా ఉండగా.. బీసీ, మైనార్టీ, కాపు, వైశ్య , క్షత్రియ, బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, మేదర, కుమ్మరి కులాల యువతీ యువకులు ఉపాధి కోసం రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గత నెలలో ప్రకటన వెలువడింది. ఈసారి కొత్తగా యూనిట్ విలువ నిర్ధారించలేదు. యూనిట్ ఆధారంగా రుణాలు మంజూరు చేస్తారు. అలాగే కొత్తగా జనరిక్ షాపులకు అవకాశం కల్పించారు. ఉత్తరాంధ్ర ఎంఎల్‌సీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఇవ్వడంతో కోడ్ కారణంగా దరఖాస్తు నమోదు ప్రక్రియ నిలిచింది. ఎన్నికల కోడ్ ఎత్తి వేయడంతో తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ ఈనెల 10వ తేదీ తరువాత మొదలైంది. ఈనెల 22వరకు గడువు ఇచ్చారు. కానీ ఆశించిన స్థాయిలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రాలేదు. దీంతో ఈనెల 25 వరకూ గడువు పెంచారు. జిల్లా వ్యాప్తంగా 19,616 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇవి కూడా ఆశించిన స్థాయిలో లేవని అధికారులు అంటున్నారు.

సామాజికవర్గాల వారీగా..

జిల్లాలోని బీసీ కులాలకు చెందిన వారు సెల్ఫ్ ఫెనాన్స్ యూనిట్లకు 17, 478 దరఖాస్తులు అందించారు. జనరిక్ షాపులకు 50, మేదరి, కుమ్మరి కులాల నుంచి 146 దరఖాస్తులు వచ్చాయి. వైశ్య కులానికి సంబంధించి సెల్ఫ్ ఫెనాన్స్‌కు 901, జనరిక్‌కు రెండు దరఖాస్తులు వచ్చాయి. బ్రాహ్మణులు 53 మంది, క్షత్రియలు 50 మంది దరఖాస్తు చేశారు. రెడ్డి సామాజిక వర్గం నుంచి 8 మంది, కాపుల నుంచి సెల్ఫ్ ఫైనాన్స్ యూనిట్లకు 675 మంది, జనరిక్ షాపులకు 21 మంది దరఖాస్తు చేశారు. ఈబీసీ నుంచి 43, కమ్మ సామాజిక వర్గం నుంచి 10 దరఖాస్తులు వచ్చాయి. గతంతో పోలిస్తే దరఖాస్తులు తక్కువగా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అన్ని కులాల వారికి సెల్ఫ్ ఫెనాన్స్, జనరిక్ కలిపి రూ.71.33 కోట్లతో 3,379 యూనిట్లు లక్ష్యంగా నిర్ధారించారు.



గంట్యాడలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

హైవేపై వాహనాల పార్కింగ్

● రోడ్డుపై వెలగని విద్యుద్దీపాలు ● ఇబ్బంది పడుతున్న వ్యాపారులు ● ట్రాఫిక్‌కూ అంతరాయం

గజపతినగరం, మార్చి28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాల పార్కింగ్‌తో స్థానికులు, వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతేడాది స్థానిక చంపావతి వంతెన నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 1.2 కిలోమీటర్లు జాతీయ రహదారి విస్తరణ జరిగింది. అలాగే మేజర్ పంచాయతీ గజపతినగరంతో పాటు పురిటిపెంట పంచాయతీలకు సంబంధించి రోడ్డు మధ్యలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య తొలగిపోతుందని స్థానికులు, వ్యాపారులు భావించారు. అయితే అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. రోడ్డు విస్తరణ తరువాత దుకాణాల ముందే ఇష్టారాజ్యంగా వాహనాలు నిలుపుతున్నారు. దాంతో వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుందని ఆవేదన చెందుతున్నారు. అలాగే రహదారి వెంబడి ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు వెలగడంలేదు. చీకటి పడితే రోడ్డంతా అంధకారమే. తోపుడు బండ్ల వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఎస్ఐ లక్ష్మణరావు వివరణ కోరగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. నిబంధనలు పాటించని వారికి అపరాధరుసుం విధిస్తామన్నారు.



జాతీయ రహదారిపై నిలిపిన వాహనాలు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

రాజాం రూరల్, మార్చి 28 (ఆంధ్ర జ్యోతి): రాజాం-డోలపేట మధ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సంత కవిటి మండలం బొద్దూరు గ్రామానికి చెందిన దమయంతి తీవ్రంగా గాయపడ్డారు. కాలు విరిగిపోవడంతో పాటు శరీరంలో పలుచోట్లగా యాలయ్యారు. రాజాంలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న ఆమె శుక్ర వారం రాత్రి విధులు ముగించుకుని స్కూటీపై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ ఇంజినీరింగ్ కళా శాల విద్యార్థి బలంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో మహిళను ఢీకొన్న విద్యార్థి రొక్కం కార్తీక్ సైతం గాయాల పాలయ్యాడు. వీరిద్దరూ రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు

పేకాట శిబిరంపై దాడి

మెరకముడిదాం, మార్చి 28(ఆంధ్ర జ్యోతి): మండలంలోని చినపూతికవలస శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం చీపురుపల్లి సీఐ శంకరరావు ఆధ్వర్యంలో బుదరాయవలస ఎస్ఐ లోకేశ్‌కుమార్ సిబ్బందితో దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి నట్లు బుదరాయవలస ఎస్ఐ లోకేష్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21,600 నగదు, మూడు ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నాయన్నారు.

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి

బొబ్బిలి/రూరల్, మార్చి 28 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చిత్రకోట బొడ్డవలస గ్రామంలో కొండగొర్రె నీలమ్మ మెట్టు దగ్గర శుక్రవారం ట్రాక్టర్ బోల్తాపడిన ప్రమాదంలో పెద్దిరెడ్డి పోలరాజు (56)అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి సీఐ కటకం సతీష్‌కుమార్ వెళ్లి పరిశీలించారు. ఆయన కథనం ప్రకారం.. టేకు మొక్కలకు నీరు పోసేందుకు నీళ్ల ట్యాంకుతో ఉన్న ట్రాక్టర్‌ను పోలిరాజు నడుపుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పొలంలో ఎత్తుపల్లాలు బాగా ఉండటంతో ఎత్తు నుంచి దిగువకు వెళ్తున్న సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ఇంజిన్ కింద డ్రైవర్ పోలిరాజు ఉండిపోవడంతో ఆయన తల నుజ్జునుజ్జు అయింది. మృతుడి కుమారుడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేశారు. సమాచారం తెలియగానే ఎమ్మెల్యే బేబీనాయన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుని బంధువులను పరామర్శించారు. పోలరాజు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం కాశయ్యపేట గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన బొబ్బిలి కోటలో డ్రైవరుగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య లక్ష్మి ఇద్దరు పిల్లలు సూర్య నారాయణ, భవాని ఉన్నారు.

అప్రమత్తంగా ఉండండి

కొమరాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన రావు సూచించారు. మండలంలోని కందివలసలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో అనారోగ్య లక్షణాలను సకాలంలో గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యుడు సీహెచ్ అరుణ్‌కుమార్, ఏఎంవో సూర్యనారాయణ, పీహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుల వివక్ష కేసుపై దర్యాప్తు

భామిని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సొలికిరి గ్రామంలో కుల వివక్ష కేసుపై పాలకొండ డీఎస్పీ రాంబాబు శుక్రవారం దర్యాప్తు నిర్వహించారు. బాలేరు గ్రామానికి చెందిన లింగాల మోహనరావును సోలకిరి గ్రామా నికి కొత్తకోట గోవిందరావు కులం పేరుతో దూషించాడని బత్తిలి పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ సోలకిరి దర్యాప్తు నిర్వహించారు. పలువురి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఆయనతో బత్తిలి ఎస్ఐ అనిల్ కుమార్, వీఆర్వోలు రామారావు, శంకరరావు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి చర్యలు

గరుగుబిల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లోని సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని డీ ఆర్‌డీఏ పీడీ సుధారాణి అన్నారు. శుక్రవారం నవిరి గ్రామంలో ఎన్యుమ రేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సంఘాల్లో వార్షిక రుణ, జీవనోపాధులు ప్రణాళికలు ఏప్రిల్ 7లోగా ప్రణాళికలు పూర్తి చేయాలన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

మక్కువ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జీడి పంటకు మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ పార్వతీపురం ఐటీడీఏ వద్ద శనివారం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకురాలు వి.ఇందిర కోరారు. మండలంలోని నగుళ్ల, దుగ్గేరు గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు.

సాంకేతికతను వినియోగించుకోండి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

రాజాం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి తనకంటూ ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే ఫలితం సులభంగా సాధించవచ్చన్నారు. ఇక్కడి ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 27వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వం సైతం సాంకేతికతకు పెద్దపీట వేస్తోందన్నారు. యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని శ్రీనివాస్ గుర్తు చేశారు. ఈ సందర్భంగా కళాశాలతో తనకున్న నాలుగేళ్ల అనుబంధాన్ని విద్యార్థులకు మంత్రి గుర్తు చేసుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం తానిక్కడే ఇంజినీరింగ్ పూర్తి చేశానన్నారు. ఆ రోజుల్లో ప్రతి వార్షికోత్సవంలో ఆటల పోటీల్లో విజేతగానో, సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందుతూ వేదికపైకి వచ్చేవాడినని ప్రస్తుతం మంత్రి హోదాలో రావడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో పద్మజాశ్రీరాం, డా.గిరీష్, డా.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలు'



ఆందోళన చేస్తున్న క్రైస్తవ సంఘాల నేతలు

విజయనగరం దాసన్నపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవ సమాజానికి తీరని లోటు అని, ఆయన మృతిపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయని క్రిస్టియన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.ఎం.రాజు అన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతిని నిరసిస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట క్రైస్తవ సంఘాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ మృతి విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని క్రైస్తవ సమాజాన్ని కాపాడాలన్నారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మధు, ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ప్రేమానందం మాట్లాడుతూ ప్రవీణ్ మరణం ప్రమాదం కాదని, హత్య అనే అనుమానం అందరికీ ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలన్నారు. ఆందోళనలో క్రైస్తవ సంఘాల నేతలు ఎం.ఐజాక్, ఎం.పాల్‌సన్, వివేక్, సత్యరాజు, వెంకటరమణ, మనోహర్ తదితరులున్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాడుతాం



దీక్షా శిబిరంలో రెల్లి కులస్థులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన రెల్లి కులస్థులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని రెల్లి మేధావుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి ఆదిసురేంద్ర హెచ్చరించారు. నగరంలోని అంబేద్కర్ జంక్షన్‌లో రెల్లి కులాలకు న్యాయం చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న నిరహార దీక్ష శిబిరం శుక్రవారం ఐదోరోజుకు చేరింది. దీక్షాశిబిరాన్ని ఆదిసురేంద్ర సందర్శించి ఆయన మాట్లాడారు. రెల్లి వాటి ఉపకులాల మూలాలు పరిశీలించాలన్నారు. విజయనగరంలోనే 76 వేల మంది రెల్లి కులస్థులు ఉన్నారన్నారు. జనాభా ప్రాతిపదికన అధికంగా ఉన్నప్పటికీ వర్గీకరణలో తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ చేసి వర్గీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రవికుమార్, దుర్గారావు, రఘు, శ్రీను, గురునాథ్, అశోక్, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు తయారు చేయండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ

విజయనగరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు 2025-26 వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళికలను తయారు చేయాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి అన్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ సభ్యులకు జీవనోపాధులు ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడికి రుణ, జీవనోపాధుల ప్రణాళిక తయారు చేసేందుకు మొబైల్ యాప్ అందించామన్నారు. దానిలో ప్రతి సభ్యురాలి అప్పు, నిల్వ, కుటుంబ అవసరాలకు కావలసిన పెట్టుబడి వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి, డి.రత్నాకర్‌తో పాటు ఏరియా కో-ఆర్డినేటర్లు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

మామిడికాయ రూ.25



జామి, మార్చి28 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండగ నేపథ్యంలో మామిడికాయలకు డిమాండ్ ఏర్పడింది. ఈ ఏడాది స్థానికంగా దిగుబడి అంతంత మాత్రంగా ఉండటంతో ఒక్కో మామిడికాయను రూ.25 చొప్పున పట్టణంలో విక్రయిస్తున్నారు. స్థానికంగా పంట లేకపోవడంతో విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తీసుకువచ్చి పట్టణంలో అమ్మకాలు చేపడుతున్నారు.

భూముల సంరక్షణలో అధికారులు విఫలం

●కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ధ్వజం



మాట్లాడుతున్న బంగార్రాజు

నెల్లిమర్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 60లోని ప్రభుత్వ భూమిని అక్రమార్కులు ఆక్రమించుకున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములను కాపాడేది ఎవరని వారు ప్రశ్నించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టౌన్ ప్లానింగ్ సమీక్ష సమయంలో సభ్యులు మైపాడ ప్రసాదరావు, లెంక అప్పలనాయుడు తదితరులు మాట్లాడుతూ సర్వే నెంబరు 60లోని చంద్రబాబునగర్ కాలనీలో కబ్జాల పర్వం కొనసాగుతోందన్నారు. అధికారులు ఏం చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. నగర పంచాయతీ కార్యాలయం పక్కన బయిరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపాన్ని విస్తరిస్తే మేలు అని 6వ వార్డు కౌన్సిలర్ భర్త లెంక అప్పలనాయుడు కౌన్సిల్ ప్రస్తావించడంతో జనసేన నాయకులు రవ్వా నాని, అప్పికొండ రవికుమార్ అభ్యంతరం తెలిపారు. కల్యాణ మండపం పక్క స్థలాన్ని గతంలో ఓంశాంతి సంస్థకు అప్పగించారని, అదే స్థలాన్ని ఇప్పుడు కల్యాణ మండపంలో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. దాంతో కౌన్సిల్‌లో గందరగోళం నెలకొంది. దాంతో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కలుగజేసుకొని ఇరువర్గాలను వారించారు. నెల్లిమర్ల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కమిషనర్ కె.అప్పలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోండి



మాట్లాడుతున్న ఏపీడీ రమామణి

శృంగవరపుకోట రూరల్,మార్చి28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పద్ధతి మార్చుకోకుంటే ఉద్యోగాలు కోల్పోడం ఖాయమని ఏపీడీ రమామణి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తనిఖీలు చేసిన ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ కొందరు ఉద్యోగులు వందరోజుల పని కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. మండలంలో 10282 జాబ్ కార్డులు ఉంటే 1890 మందికి వంద రోజులు పనిదినాలు కల్పించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మస్తర్ల వెరిఫికేషన్‌లో కమిషనర్ చాలా కఠినంగా ఉన్నారన్నారు. ఇటీవల 73 మందిని టెర్మినేట్ చేసిన విషయం వివరించారు. సోషల్ ఆడిట్‌లో మస్తర్లు లేకుండా డబ్బులు చెల్లింపు, దిద్దుబాట్లు, పలు చెల్లింపులలో తేడాలు వివరించారు. వీటిపై కొంతమంది క్షేత్ర సహాయకులకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి తదితరున్నారు.

ప్రజావేదికలో తప్పులు బహిర్గతం

దత్తిరాజేరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండ పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, ప్రొసీడింగ్ అధికారి పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావేదికలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 35 పంచాయతీల్లోని గ్రామాల్లో రూ.19.26 కోట్లతో నిర్వహించిన 1309 పనులపై ఆడిట్ నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో పనులకు వెళ్లినట్టు డబ్బులు చెల్లించి సంతకాలు తీసుకోలేదని, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని గుర్తించారు. రికార్డుల్లో ఉన్న మొక్కల సంఖ్యకు క్షేత్రస్థాయిలో ఉన్న మొక్కలకు పొంతన లేదని అధికారులు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ మన్మథరావు, ఏపీవో వెంకటప్పలనాయుడు, సత్యవతి పాల్గొన్నారు.

విధుల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గంట్యాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వర్రి దేముడును విధుల నుంచి తప్పిస్తూ డ్వామా పీడీ శారదా దేవి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ దేముడు గ్రామంలోని వేతన దారులకు పనులు కల్పించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండటంతో ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి'లో 'ఉపాధి పనులకు ఎదురుచూపు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి డ్వామా పీడీ స్పందించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేయించారు. అతడిని బాధ్యతల నుంచి తప్పించారు.

గెడ్డ ఆక్రమణను నిలువరించండి



గెడ్డలో వేసిన కాంక్రీట్ స్తంభాలు

చీపురుపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లేదారిలో అమ్మవారి పాదాలకు సమీపంలో కొంతమంది పెద్ద గెడ్డను ఆక్రమించారు. అనధికార కట్టడాలు చేపడుతున్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గెడ్డలో కొందరు వ్యక్తులు అనధికారికంగా చేపట్టిన నిర్మాణం వల్ల వరదనీరు సక్రమంగా ముందుకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. భవిష్యత్తులో రోడ్డుపైకి వచ్చే ప్రమాదం ఉందన్నారు. అక్రమ నిర్మాణాన్ని నిలువరించే చర్యలు చేపట్టాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

గురుదేవకు 'ఐడీబీఐ' సాయం

కొత్తవలస, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గురుదేవ చారిటబుల్ ట్రస్టుకు ఐడీబీఐ (ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్) పూర్తి సహకారం అందిస్తుందని ఆ బ్యాంక్ విశాఖపట్నం జీఎం కన్వాదీబ్ దాస్, రీజనల్ కో-ఆర్డినేటర్ సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మంగళపాలెంలో గురుదేవ చారిటబుల్ ట్రస్టును వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుదేవ ట్రస్టులో తాము భాగస్వాములు కావాలని మూడు నెలలుగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలతో పాటు వివిధ రకాల ఉపకరణాలను అందించేందుకు గుర్తింపు కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా 750 మందికి కృత్రిమ అవయవాలు, ఉపకరణాలను అందజేశామన్నారు. భవిష్యత్తులో కూడా తమ ఐడీబీఐ ద్వారా సేవాకార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ఉపకరణాలను అందించడం.. మరోపక్క గురుదేవ ఆసుపత్రి ద్వారా వైద్య సేవలు, క్యాన్సర్ రోగుల కోసం ఉప్పలపాటి విజయశ్రీ మెమోరియల్ క్యాన్సర్ ఆసుపత్రి నిర్వహించడం సాధారణ విషయం కాదన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీశ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు బాగ్‌చంద్ అగర్వాల్, పీవీ నారాయణరావు, ట్రస్టు వైస్ చైర్మన్ ఫణీంద్ర పాల్గొన్నారు.



దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేస్తున్న బ్యాంక్ ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వేపాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త బొద్దాం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బసనబోయిన కార్తీక్ (21) మృతి చెందాడు. తన స్నేహితులతో కలిసి ఎస్.కోట నుంచి స్కూటీపై ఎల్.కోట పండగకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టింది. స్కూటీపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కార్తీక్ మృతి చెందినట్టు మృతిడి కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

భామిని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పసుకుడి గ్రామానికి చెందిన మువ్వాల జయరాం(17)వారం రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయాల పాలయ్యాడు. శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. గత శుక్రవారం జయరాం తన అక్క రాణి, తమ్ముడు మనోజ్‌తో కలిసి బైకుపై పసుకుడి గ్రామం నుంచి లివిరి యాత్రకు బయలుదేరాడు. భామిని సమీపంలోకి వచ్చేసరికి ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్ర గాయాలపాలైన జయరాం, రాణిలను శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. జయరాం మృత్యువుతో పోరాడి వారం రోజుల తర్వాత తుదిశ్వాస విడిచాడు. బత్తిలి ఎస్ఐ అనీల్‌కుమార్ కేసు నమోదు చేశారు. శవ పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. జయరాం భామిని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. చేతికందిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు భవానీ, అప్పలనాయుడు కన్నీరుమున్నీరయ్యారు. ప్రస్తుతం రాణి శ్రీకుకుళం ప్రైవేట్ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతోంది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

దత్తిరాజేరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని తోటలో సీతానగరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన చెమరపల్లి వినోద్‌కుమార్ ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గడ్డి మందు సేవించిన సదరు వ్యక్తిని అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పీహెచ్‌సీకి తరలించారు. అతడి పరిస్థితి విషమించడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు.

పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2021లో నమోదైన పోక్సో కేసులో విజయనగరంలో గోకపేటకు చెందిన కంది సన్యాసిరావు అలియాస్ సిద్ధూ (19)కు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10,500 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలికతో గోకపేటకు చెందిన సిద్ధూ ఫేస్‌బుక్‌లో పరిచయం పెంచుకుని ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి తరచూ తన ఇంటికి తీసుకువెళ్లి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గర్భవతిని చేసి పెళ్లికి నిరాకరించాడు. దాంతో ఆమె విజయనగరం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ స్వర్ణలత పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి దిశ మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ త్రినాథ్ దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా మహిళా పీఎస్ సీఐ నర్సింహమూర్తి చర్యలు చేపట్టారు. సన్యాసిరావు నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు న్యాయాధికారి నాగమణి తీర్పుని వెల్లడించారన్నారు. కేసులో బాధితురాలికి రూ.2 లక్షల నష్టపరిహారాన్ని మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారన్నారు.

చీపురుపల్లిలో చోరీ

చీపురుపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తగవిడివీధిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సిద్ధార్థ కాన్వెంట్‌కు ఎదుట వై.లక్ష్మణరావు ఇంట్లోకి చొరబడి అర కిలో వెండి, పాతిక వేలు నగదు అపహరించారు. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఇంటి ఆవరణలోకి ప్రవేశించిన దొంగలు, కిటికీలకు బిగించిన ఇనుప ఫ్రేమ్‌లను తొలగించి ఇంట్లోకి చొరబడ్డారు. హాలుల్లో వివిధ ప్రదేశాల్లో ఉంచిన పాతిక వేలు నదగు, పూజా గదిలో ఉన్న సుమారు అర కిలో వెండి సామగ్రి ఎత్తుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న క్లూస్ టీం, సంఘటనా స్థలానికి చేరుకొని, ఆధారాలను సేకరించింది. సమీపంలో ఉన్న సీసీ టీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇలా ఉండగా అంతకు ముందు, సమీపంలో ఉన్న మరో ఇంట్లోకి కూడా దొంగలు చొరబడి విలువైన వస్తువులు దొంగిలించినట్టు తెలిసింది.

క్రికెట్ బెట్టింగ్: వ్యక్తి అరెస్టు

బొండపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లాంలో ఓ ఇంటిలో టీవీ చూస్తూ ఆన్‌లైన్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ యు.మహేష్ శుక్రవారం తెలిపారు. బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని రూ.90,500ల నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లో ఉన్న బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించి మరో ఐదుగురు వివరాలను తెలుసుకునేందుకు యత్నిస్తున్నామన్నారు.

25 కేజీల పాలిథిన్ కవర్లు సీజ్

రాజాం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘం పరిధిలోని కూరగాయల దుకాణాలు, మాంసం దుకాణాలపై శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్ దాడులు చేపట్టారు. సుమారు 25 కేజీల పాలిథిన్ కవర్లను సీజ్ చేశారు. ఎవరైనా విక్రయించినా, వినియోగించినా వారికి రూ.500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు

గరుగుబిల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేవస్థానం ప్రాంగణంలో ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ పి.బాల హెచ్చరించారు. తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణలను గుర్తించి తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సూర్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, సర్వేయర్ ఎస్.గాంధీ, వీఆర్వో టి.రవికుమార్, దేవస్థానం అభివృద్ధి కార్యదర్శి డా.డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

పాలకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకుని జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా జైళ్ల శాఖాధికారి కె.మోహన్‌రావు సూచించారు. పాలకొండ సబ్ జైలును ఆయన శుక్రవారం సందర్శించారు. జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

లే చిన్నా.. ఇంటికెళ్దాం!

(3వ పేజీ తరువాయి)


విద్యార్థి మృతికి కారణమైన బంకర్ బెడ్

తోటి విద్యార్థులతో మాట్లాడారు. ప్రమాదం ఎలా జరిగిందో ఆరా తీశారు. ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. చలపతి దహన సంస్కారాల నిమిత్తం తల్లి లడ్డమ్మకు అధికారులు రూ.10 వేలు అందజేశారు. మరోవైపు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వార్డెన్ సుబ్బారావుకు మెమో జారీ చేశారు. పాలకొండ డీఎస్పీ రాంబాబు, పీ చంద్రమౌళిలు దోనుబాయి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. మృతుని తల్లి లడ్డమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మస్తాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలిఫెంట్ జోన్ ఆపాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బెలగాం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలో ఏర్పాటు చేస్తున్న ఎలిఫెంట్ జోన్ ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతానగరం మండలంలోని అమాదేవి కొండ చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు సమస్యగా ఎలిఫెంట్ జోన్ మారుతుందని, వెంటనే అక్కడ పనులను ఆపాలని డిమాండ్ చేశారు. ఏనుగులను తరలించాలని కోరితే జనావాసాల మధ్య తెచ్చి పెడుతున్నారని అన్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కొండపై 50 ఏళ్లుగా జీడి, తదితర పంటలను సాగు చేస్తున్న గిరిజనులు, దళితులకు జీవనాధారం పోతుందని ఆమె వాపోయారు. కొండ మీద వర్షం పడితే ఆ నీరు కింద పొలాలకు రావడంతో పంటలు పండించుకునేవారని, ట్రెంచ్ కొట్టడం వల్ల ఆ నీరు అక్కడే ఆగిపోతుందని ఆమె వివరించారు. వెంటనే ఎలిఫెంట్ జోన్ ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణమూర్తి, రెడ్డి వేణు, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన హెచ్ఎం

జియ్యమ్మవలస, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థిని హెచ్ఎం చితకబాదిన ఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. పాఠశాల ప్రార్థనా సమయంలో 8వ తరగతి విద్యార్థి కాస్త అల్లరి చేస్తున్నాడు. దీన్ని గమనించిన హెచ్ఎం ఆ విద్యార్థిని కర్రతో కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి, గెంబలి గోవిందరావు పాఠశాలకు వెళ్లి నిలదీశారు. హెచ్ఎం వారికి పరిస్థితిని వివరించారు. ఇదిలా ఉండగా ఈ విషయం కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేసింది. దీంతో శుక్రవారం ఉదయం డిప్యూటీ డీఈవో కృష్ణమూర్తి, ఎంఈవో-1 డి.గౌరునాయుడు పాఠశాలకు వెళ్లి విద్యార్థి, తల్లిదండ్రులను, పాఠశాల యాజమాన్యాన్ని పిలిపించి విచారించారు. వారి నుంచి విడివిడిగా స్టేట్‌మెంట్లు తీసుకున్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలని వినతి


ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి రోడ్డు, తాగునీరు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని కొండచిలకం గ్రామస్థులు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కోరారు. ఈ మేరకు శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందించారు. గ్రామంలో రోడ్డు లేక వర్షాకాలంలో చాలా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందిగా ఉందన్నారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీఇచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

జియ్యమ్మవలస గ్రామానికి చెందిన వరదా సరోజనికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం అందించారు. సరోజనికి అనారోగ్యం కారణంగా ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.50,786 మంజూరైంది. ఈ చెక్కును గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాధితురాలికి అందజేశారు. జియ్యమ్మవలస మండల నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టాలను అంచనా వేయాలి

పాలకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంట నష్టాలను అంచనా వేసి, రైతులకు పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. మండలంలోని లుంబూరు గ్రామానికి చెందిన వావిలపల్లి రమణమూర్తి అనే రైతుకు చెందిన సుమారు ఎకరా అరటి తోట ఇటీవల అకాల వర్షానికి నేలమట్టమైంది. ఈ పంటను రైతు సంఘం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టాలను అంచనా వేసి పరిహారం ఇవ్వాలన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో అరటి పంట నాశనమైందన్నారు. పంట నష్టాన్ని పరిశీలించిన వారిలో రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు, కిమిడి రామ్మూర్తినాయుడు, పామోటి వైకుంఠరావు తదితరులు ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు కృషి చేయాలి

కురుపాం, మార్చి28(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలు శత శాతం జరిపించాలని ఆదర్శ పాఠశాలల స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కె.ధర్మకుమార్ కోరారు. కురుపాం ఆదర్శ పాఠశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రామలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వెనుకబడిన విద్యార్థుల ప్రగతికి కోసం ఎటువంటి చర్యలు తీసుకుటున్నారని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఎటువంటి ఆరోపణలు రాకుండా చూడాలని ఆదేశించారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

ఒడిశా

రాయగడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక తేజసీ మైదానంలో బిజూ జనతాదళ్ నాయకుడు, జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అధ్యక్షతన వివిధ పోటీలు నిర్వహించారు. రంగవల్లుల పోటీలో విజయలక్ష్మి పాలో, ఎం.మౌనిక, జె.గంగ విజేతలుగా నిలిచారు. గోరింటాకు పోటీలో సోఫియా బెహెరా, రాధారాణి కౌసల్య, పి.వర్షితలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. గోరింటాకు పోటీలో సంజుపాఢి, వనితపాత్రో, జె.గంగలు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ఉగాది వేదికపై బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మజ్జి శ్రీనివాసరావు, భళ్లమూడి నాగరాజు, సీహెచ్ జ్యోతి చిట్టి, కిరణ్‌కుమార్, బొత్స శ్రీనివాసరావు, అప్పారావు తదితరులు సహకరించారు.

గిరిజనులను ఇబ్బందులకు గురిచేయొద్దు

- మంత్రి సంధ్యారాణి


గిరిజనుల సమస్య వింటున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గిరిజనులను అకారణంగా ఇబ్బందులకు గురి చేస్తే సహించే ప్రసక్తే లేదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. సాలూరులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా కూర్మరాజుపేట పంచాయతీ పునికిలవలస గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు వచ్చి.. తాము ఎప్పటి నుంచో సాగు చేసుకుంటూ అన్ని హక్కు పత్రాలు కలిగిఉన్నప్పటికీ తమ భూములు లాక్కోవటానికి కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. స్పందించిన మంత్రి.. వెంటనే తహసీల్దార్ ఎన్వీ రమణను అక్కడకు రప్పించారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములను వారిని భయపెట్టి లాక్కుందామని ప్రయత్నిస్తే సహించేది లేదని అన్నారు. మారుమూల గ్రామలకు సైతం పూర్తి స్థాయిలో రహదారులు నిర్మించాలని ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. తమకు దూప దీప నైవేద్యం ఖర్చులు వచ్చేలా చేయాలని, అలాగే ఆలయ కమిటీల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లాలో ఉన్న పలువురు అర్చకులు మంత్రిని కలిసి తమ సమస్యను వివరించారు. ఇలా అనేక సమస్యలపై ప్రజలు రాగా.. ఉన్నతాధికారులతో మాట్లాడి, వారి సమస్యల పరిష్కారానికి ఆమె ప్రయత్నాలు చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి

- పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సీతంపేట మండల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు అందరూ సహకరించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక వైటీసీ కేంద్రంలో ఎంపీపీ బి.ఆదినారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అభివృద్ధి పనులపై అధికారులు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని దోనుబాయి సర్పంచ్ కోటేశ్వరరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో వెండర్ విధానంపై దృష్టి సారించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులపై స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని, ప్రోటోకాల్ పాటించాలని ఆయన అధికారులకు సూచించారు. వెండర్ విధానంపై సీఎం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉందని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. అనంతరం రెవెన్యూ, వ్యవసాయ శాఖ, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్, హౌసింగ్, విద్యుత్ తదితర శాఖలపై చర్చ నిర్వహించారు. ● సమావేశంలో మైక్‌లు మొరాయించడంతో ఎమ్మెల్యే తోపాటు సభ్యులు ఇబ్బందులు పడ్డారు. ఎంపీడీవో కె.గీతాంజలి, జడ్పీటీసీ సవర లక్ష్మి, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, ఈవోపీఆర్డీ సత్యం పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోండి

గిరిజన రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే జయకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవీటీజీ లబ్ధిదారులకు సీసీడీపీ, ఎస్‌సీఏ టు టీఎస్ఎస్ నిధులతో యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, ఆయిల్ ఇంజన్, పిండి మిల్లులను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఏవో సునీల్, పీహెచ్‌వో వెంకటగణేష్, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, హెచ్‌వో జయశ్రీ, కూటమి నాయకులు సవరతోట మొఖలింగం, పవన్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు కలెక్టర్ అభినందన

- చిత్రలేఖనం, కళల విభాగంలో
- రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం


విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం/ గుమ్మలక్ష్మీపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో బుధవారం జరిగిన జన్ జాతీయ గౌరవ దివాస్ గిరిజన స్వాభిమాన వేడుకలు-2025లో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి గిరిజన చిత్రలేఖనం, కళల విభాగంలో పార్వతీపురం ఐటీడీఏకు ప్రథమ స్థానం రావడం పట్ల కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన తన చాంబర్‌లో విద్యార్థులను అభినందించారు. సీనియర్ విభాగంలో మండంగి బాలచంద్రుడి ప్రథమ బహుమతి, జూనియర్ విభాగంలో టిక్కబాయి గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి హరిక రాజేష్‌కు ద్వితీయ బహుమతి, హరిక గౌతమ్‌కు ప్రత్యేక బహుమతి, కురుపాం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి హరిక అన్వితకు కాన్సలేషన్ బహుమతి రావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. లైజన్ ఆఫీసర్, డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రాయింగ్ టీచర్‌కు ప్రశంసలు

జియ్యమ్మవలస, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రావాడ రామభద్రపురం టీడబ్ల్యూఏహెచ్ స్కూల్‌లో డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావును కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ శుక్రవారం పార్వతీపురంలోని వారి చాంబర్‌లో అభినందనలు తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ట్రైబుల్ స్టేట్ లెవెల్ పెయింటింగ్, ఆర్ట్స్ పోటీలలో రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల నుంచి 250 మంది పాల్గొనగా, అందులో జిల్లాకు ప్రధాన స్థానం రావడానికి శ్రీనివాసరావు కృషే కారణంగా చెప్పుకోవచ్చు. గత మూడు సార్లు మూడేళ్లు కూడా కోఆర్డినేటర్ అండ్ లైజన్ ఆఫీసర్‌గా ఉండి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడానికి కారణం ఇతడే కావడం గమనార్హం. దీనిపై ట్రైబుల్ సీఆర్టీలు అందరూ శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

అక్రమ కట్టడాలను పట్టించుకోరా?

- సాలూరు మునిసిపల్ సర్వసభ్య సమావేశంలో ధ్వజమెత్తిన కౌన్సిలర్లు


మునిసిపల్ అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ మాధవరావు

సాలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలో ఎక్కడ పడితే అక్కడే అక్రమ కట్టడాలు కడుతుంటే మున్సిపల్ అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు అజెండాలో అంశాలను చదివి వినిపించారు. అనంతరం వైసీపీ కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గిరి రఘు, వంగపండు అప్పలనాయుడుతో పాటు పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు ఎలా నిర్మిస్తున్నారని.. దీనిపై అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తాను విధుల్లో చేరిన తర్వాత నిర్మించిన అక్రమ కట్టడాలకు నోటీసులు ఇచ్చామని టౌన్ ప్లానింగ్ అధికారిణి ఝాన్సీ తెలిపారు. అనంతరం టీడీపీ కౌన్సిలర్లు మజ్జి శైలజ, సీతమ్మ, వైదేహి, వరలక్ష్మి, లక్ష్మీజీ, హర్షవర్ధన్‌లు.. మున్సిపాల్టీలో తాత్కాలిక పద్ధతిపై కొన్ని నియామకాలు చేపట్టాలని చూస్తున్నారని, కానీ ప్రస్తుతం ఉన్న సిబ్బందికే సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని కమిషనర్‌కు అభ్యంతర కాపీని అందజేశారు. తమ వార్డు పరిధిలో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని 26వ వార్డు కౌన్సిలర్ సన్యాసమ్మ అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. 16 వార్డులో మున్సిపల్ వాటర్ ట్యాప్‌ల నుంచి నాచు వస్తుందని దానివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ రాపాక మాధవరావు సమావేశంలో తెలిపారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మక్కువ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మక్కువ మండలంలో మూడు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు, ఒక ఆయా పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో బి.అనంతలక్ష్మి శుక్రవారం తెలిపారు. మండలంలోని కాజీపట్నం పంచాయతీ పరిధి పాపయ్యవలస, చప్పబు చ్చింపేట పంచాయతీ పరిధి మోసరువలస, పసనభద్ర పంచాయతీ పరిధి బంధమెండంగి గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎ.వెంకంపేట పరిధి ఎ.వెంకంపేట- 1లో ఆయా పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. 21 నుంచి 35 లోపు వయసు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీల్లో 21 ఏళ్ల వారు లేనట్టయితే 18 సంవత్సరా ల వారిని తీసుకుంటామని చెప్పారు. పదో తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు వచ్చే నెల 4వ తేదీన సాయంత్రం ఐదు గంటల లోపు పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

విద్యార్థి మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణం

సీతంపేట రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దోనుబాయి ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థి చలపతి మృతికి అధికారులు నిర్లక్ష్యమే కారణమని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన దోనుబాయి పాఠశాలను సందర్శించి, విద్యార్థి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై గిరిజన సంక్షేమ శాఖా మంత్రి, గిరిజన సంక్షేమ విద్యా శాఖాధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన వారిని విధులు నుంచి సస్పెండ్ చేయాలని అన్నారు. అలాగే బాధిత కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సీపీఐ మండల కార్యదర్శి జగదీష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.గోపీనాయుడు, బి.బంగారు ఉన్నారు.

తోటపల్లిలో వసతులు కల్పించాలి

గరుగుబిల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి దేవస్థానం ప్రాంతంలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని తోటపల్లికి చెందిన మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి వీవీ సూర్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలోని గ్రామీణ వికాస్ బ్యాంకు ప్రాంతంలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే మూలకు చేరిన హుండీలను ఆలయాల పరిధిలో ఏర్పాటు చేయాలన్నారు. దేవస్థానానికి దాతలు అందించిన 44 సెంట్లు భూమికి సబ్ డివిజన్ చేయించి స్వాధీనం చేసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఈవో వసతులతో పాటు సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నామని చెప్పారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

బలిజిపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై వేస్తున్న రూ.32వేల కోట్ల భారాన్ని రద్దుచేసి, పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం నాయకుడు గేదెల సత్యనారా యణ కోరారు. ఈ మేరకు శుక్రవారం చిలకలపల్లి సబ్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ● పాలకొండ: ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లులు తగ్గించాలని కోరుతూ శుక్రవారం పాలకొండలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ట్రూఅప్ చార్జీలు పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్లు బిగింపును వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ ధర్నాలో పాల్గొన్నారు. ● గుమ్మలక్ష్మీపురం: విద్యుత్ భారాలపై పెద్ద ఎత్తున పోరాటానికి ప్రజలు సిద్ధపడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ కోరారు. ఈ మేరకు కన్నయ్యగూడ గ్రామంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకులు నాయుడు, సోమశేఖర్, మురళి, శంకరరావు, కామేశ్వరి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

బెలగాం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అడ్వకేట్ నల్ల శ్రీను, ఉపాధ్యక్షుడిగా అడ్వకేట్ ఎస్.కృష్ణ, జనరల్ సెక్రటరీగా అడ్వ కేట్ ఎస్.రాజేశ్వరరావు, సెక్రటరీగా అడ్వకేట్ ఎంపీ రాఘవేంద్ర, ట్రెజరరీగా అడ్వకేట్ ఎంపీ రమణలను ఎన్నుకున్నారు.

న్యూస్ బాక్స్

హైకోర్టు సీనియర్ న్యాయవాది మృతి

బలిజిపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గళావల్లి గ్రామానికి చెందిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల హైకోర్టు సీనియర్ న్యాయవాది మామిడి రామారావు (70) విశాఖపట్టణం కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. ఆయన పార్థివ దేహానికి స్వగ్రామం గళావల్లిలో శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

భద్రాచలానికి సాలూరు నుంచి ప్రత్యేక బస్సు

సాలూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలో వచ్చే నెల 6న నిర్వహించనున్న శ్రీరామనవమి ఉత్సవాలకు సాలూరు నుంచి ప్రత్యేక బస్సును నడపనున్నట్టు ఆర్టీసీ సాలూరు డిపో మేనేజర్ బి.సూర్యనారాయణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు సాలూరులో వచ్చే నెల 5వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి భద్రాచలం వెళ్తుందన్నారు. మళ్లీ భద్రాచలంలో ఆరో తేదీ సాయంత్రం 6 గంటలకు తిరుగు పయనమవుతుందన్నారు. ఆసక్తిగల వారు సర్వీస్ నెంబరు 92581, 92582లకు (అప్‌డౌన్) రిజర్వేషను చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9959225622, 9949916017 నెంబర్లను సంప్రదించవచ్చని చెప్పారు.

తోటపల్లి ఆలయ హుండీల లెక్కింపు

గరుగుబిల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల పరిధిలోని హుండీల లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి వీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ 44 రోజులకు సంబంధించి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి రూ.1,85,042లు, మిక్స్ బంగారం 17 గ్రాములు, మిక్స్ వెండి 5.436 కిలోలు భక్తులు కానుకల రూపంలో అందించారని చెప్పారు. అలాగే కోదండరామస్వామి దేవస్థానానికి రూ.1,209 వచ్చిందన్నారు. ఈ లెక్కింపులో జిల్లా దేవాదాయశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది వై.ఇందిర, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

సీతంపేట రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోనుబాయి ఆశ్రమ పాఠశాలలో ప్రమాదవశాత్తు గాయపడి మృతిచెందిన విద్యార్థి సవర చలపతి కుటుంబాన్ని ఆదుకుంటామని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన పాలకొండ ఏరియా ఆసుపత్రిలో మృతుడి తల్లి లడ్డమ్మను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఏ అవసరం ఉన్నా తనకు తెలియజేయాలని అన్నారు.